జపాన్‌కు చెందిన వాహన తయారీ సంస్థ హోండా.. థర్డ్ జనరేషన్‌గా దేశీయ మార్కెట్‌లోకి సరికొత్త అమేజ్ మాడల్‌ను విడుదల చేసింది. మూడు రకాల్లో లభించనున్న ఈ కారు ధరల శ్రేణి రూ.7.99 లక్షల నుంచి రూ.10.89 లక్షలుగా ఉన్నది.

అమెరికా-చైనా టెక్ వార్

ఇరు దేశాల మధ్య మళ్లీ వాణిజ్య యుద్ధం

సెమీకండక్టర్ ఇండస్ట్రీలో ఆధిపత్య పోరు

చిప్ తయారీ రంగం కేంద్రంగా పరస్పర ఆంక్షలు

ట్రంప్ రాకముందే రాజుకున్న మంటలు

వాషింగ్టన్/బీజింగ్, డిసెంబర్ 4: అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలైంది. అయితే ఈసారిది టెక్నాలజీ వార్‌ను సంతరించుకున్నది. చిప్ తయారీపై తీవ్ర ప్రభావం చూపేలా ఇరు దేశాలు పరస్పర ఆంక్షల్ని, నిషేధాల్ని తెచ్చిపెట్టుకున్నాయి మరి. ఈ మేరకు సోమవారం బైడెన్ సర్కారు నిర్ణయాలుంటే.. వాటికి ప్రతిగా మంగళవారం జిన్‌పింగ్ ప్రభుత్వం నిర్ణయాలు వచ్చాయి. నిజానికి గ్లోబల్ సెమీకండక్టర్ ఇండస్ట్రీలో అమెరికా, చైనాలు ఆధిపత్యం కోసం గత కొంతకాలం నుంచి కొట్టుకుంటున్నాయి. దాన్ని తీవ్రతరం చేస్తూ అమెరికా కొన్ని కొత్త నిబంధనల్ని తీసుకొచ్చింది. ఇవి 140 చైనా సంస్థల్ని ప్రభావితం చేస్తున్నాయి. ఇందులో ప్రధాన సెమీకండక్టర్ తయారీ సంస్థలైన పయోటెక్, సైక్యారియర్, నౌరా టెక్నాలజీ గ్రూప్‌లున్నాయి. కాగా, అడ్వాన్స్‌డ్ సెమీకండక్టర్ (చిప్) తయారీ టెక్నాలజీ చైనాకు అందకూడదనే లక్ష్యంగా ఆయా ఎగుమతులపై అమెరికా ఆంక్షల్ని విధించినట్టు తెలుస్తున్నది. కటింగ్-ఎడ్జ్ అడ్వాన్స్‌మెంట్స్ సాంకేతికతలో చైనా దూకుడుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో దానికి బ్రేకులు వేసేందుకే ఆ టెక్నాలజీలో బలంగా ఉన్న అగ్రరాజ్యం ఈ చర్యలకు దిగిందన్న అభిప్రాయాలు ఇండస్ట్రీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి.



చైనా ప్రతీకార చర్యలు

అమెరికా తీరుకు చైనా గట్టిగానే స్పందించింది. సెమీకండక్టర్ల తయారీలో కీలక పాత్ర పోషించే విడిభాగాల ఎగుమతులకు బ్రేక్ వేసింది. అమెరికాకు గాలియం, జర్మేనియం, ఆంటిమొని తదితర ప్రధాన హై టెక్నాలజీ సరకు రవాణాకు కళ్లెం వేసింది. జాతీయ భద్రతపై ఆందోళనల దృష్ట్యా మిలిటరీ కోసమైనా, పౌర అవసరాల కోసమైనా జరిగే వీటి ఎగుమతుల్ని నిషేధిస్తున్నట్టు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇంతకుముందు వీటి ఎగుమతులపై ఆంక్షలుండగా, ఇప్పుడు పూర్తిగా నిషేధాన్ని తెచ్చింది. ప్రపంచవ్యాప్తంగా గాలియం, జర్మేనియం లభ్యత చాలా చాలా తక్కువగా ఉన్నది. దొరికే ఆ కొద్ది నిల్వలు సైతం చైనాలోనే ఎక్కువగా ఉన్నాయి. కాగా, సెల్‌ఫోన్లు, కార్లు, సోలార్ ప్యానెల్స్, మిలిటరీ టెక్నాలజీల్లో వాడే కంప్యూటర్ చిప్స్ తయారీకి ఈ ముడి పదార్థాలన్నీ కూడా చాలా చాలా కీలకం. ఇంకా చెప్పాలంటే మిలిటరీ అప్లికేషన్ల దగ్గర్నుంచి కృత్రిమ మేధస్సు వరకు ఈ సెమీకండక్టర్లే ప్రధానం. దీంతో అమెరికా-చైనా వాణిజ్య సంబంధాలు ఒక్కసారిగా చెడినట్టైంది. అంతకుముందు అమెరికా.. కొత్త తరం సాంకేతికతతోకూడిన చిప్‌ల తయారీలో వినియోగించే పరికరాలు, అత్యున్నత శ్రేణి మెమరీ చిప్స్, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల ఎగుమతుల్ని కఠినతరం చేసింది. గతంలోనూ వీటిపై నిషేధం విధించినా ఆ తర్వాత సడలించింది. మానవ సాయంతో నిమిత్తం లేకుండా స్వయంప్రతిపత్తితో పనిచేయగలిగిన ఆయుధాల తయారీలో ఈ చిప్‌లే కీలకం. వాటి విడిభాగాలు ప్రస్తుతం అమెరికా నుంచే చైనాకు పెద్ద ఎత్తున వెళ్తున్నాయి.

ట్రంప్ రాకముందే..

అమెరికా నూతన అధ్యక్షుడిగా మరోసారి డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది జనవరిలో గద్దె నెక్కబోతున్నారు. ఈ క్రమంలో ట్రంప్ వచ్చిన తర్వాత అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలవుతుందన్న అంచనాలు నెలకొన్నాయి. కానీ ఇప్పుడే ఆ వాతావరణం ఏర్పడటం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. నిజానికి ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కంటే ఆ స్థానంలో ముందున్నది ట్రంపే. అప్పుడు ట్రంప్ దూకుడు.. చైనాతో పరస్పర సుంకాలకు దారి తీసింది. కానీ బైడెన్ రాకతో పరిస్థితులు కొంత శాంతించాయి. అయినప్పటికీ గత మూడేండ్లలో అమెరికా-చైనా మధ్య ఈ రకమైన పోరు వస్తూపోతూనే ఉన్నది. ఇప్పుడది తీవ్రరూపం దాల్చగా.. ట్రంప్ రాకతో ఇంకెంత తీవ్రతను సంతరించుకుంటుందోనన్న ఆందోళనలు అంతటా వ్యాపిస్తున్నాయిప్పుడు. ఇక ట్రంప్ హయాంలో చైనా నుంచి అమెరికాకు పెద్ద ఎత్తున జరిగే ఎగుమతుల కట్టడే లక్ష్యంగా సుంకాల పెంపు జరిగింది. కానీ ఇప్పుడు చిప్ తయారీలో ఆధిపత్యం కేంద్రంగా నిర్ణయాలుంటున్నాయి. మొత్తానికి వచ్చే ఏడాది నుంచి సెమీకండక్టర్ ఇండస్ట్రీల్లో అలజడులు ఖాయమనే చెప్పవచ్చు.

భారత్‌కు లాభమేనా?

అమెరికా-చైనా మధ్య చోటుచేసుకున్న ఈ ట్రేడ్ అండ్ టెక్ వార్.. భారత్‌కు లాభమేనా? అంటే అవుననే సమాధానాలే వస్తున్నాయి. ఇందుకు ట్రంప్ హయాంలో వచ్చిన అవకాశాల్నే గుర్తుచేస్తున్నారు. నాడు చైనాతో అమెరికా వాణిజ్యం పడిపోగా.. భారత్‌సహా మరికొన్ని దేశాలకు పెరిగింది. అమెరికాకు భారత్, వియత్నాం, మెక్సికో నుంచి ఆయా ఉత్పత్తుల ఎగుమతి పుంజుకున్నది. ఇప్పుడు కూడా అమెరికా సాయంతో సెమీకండక్టర్ ఇండస్ట్రీలో భారత్ నిలదొక్కుకోవచ్చన్న అంచనాలున్నాయి. నిజానికి అంతర్జాతీయంగా భారత్ ఎదుగుదలను చైనా అడ్డుకుంటున్నది. కానీ ఇదే సమయంలో భారత్‌పట్ల అమెరికా సానుకూల వైఖరిని ప్రదర్శిస్తున్నది. పైగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, డొనాల్డ్ ట్రంప్‌కు నడుమ మంచి స్నేహభావం ఉండటం కూడా ఇక్కడ కలిసొస్తుందని అంటున్నారు. భారత్ వంటి పెద్ద మార్కెట్‌ను వదులుకోవడం అమెరికాకు నష్టమేనని, కాబట్టి సాంకేతికంగా అగ్రరాజ్యం నుంచి సహకారం ఉంటుందనే ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే అమెరికా తాజా నిర్ణయం జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్ తదితర దేశాలనూ కొంత ఇబ్బంది పెడుతున్నది. దీంతో ఆసియా మార్కెట్‌లో అమెరికా-చైనా ట్రేడ్ వార్ గట్టిగానే ప్రకంపనల్ని సృష్టించేలా ఉన్నది.

జహీరాబాద్ నిమ్జ్‌లో ప్యూర్ ఈవీ ప్లాంట్

రూ.400 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సంస్థ

హైదరాబాద్, డిసెంబర్ 4: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ప్యూర్ ఈవీ..తెలంగాణలో మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నది. ఇప్పటికే సంగారెడ్డి వద్ద ప్లాంట్ ఉండగా, కొత్తగా జహీరాబాద్ నిమ్జ్‌లో రూ.400 కోట్ల పెట్టుబడితో మరో ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఫౌండర్, ఎండీ నిశాంత్ డొంగ్రీ తెలిపారు. 40 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయబోతున్న ఈ యూనిట్ వచ్చే రెండేండ్లలో అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. నెలకు 12 వేల నుంచి 15 వేల యూనిట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో కొత్తగా వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న సంగారెడ్డి ప్లాంట్‌తో 500 మంది ఉపాధి పొందుతున్నారన్నారు. కంపెనీకి చెందిన వాహనాలకు దేశవ్యాప్తంగా డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ నూతన ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశీయంగా 70 రిటైల్ అవుట్‌లెట్లు ఉన్నాయని, వచ్చే రెండున్నరేండ్లలో మరో 250 డీలర్‌షిప్‌లను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మరోవైపు, స్కూటర్, మోటార్‌సైకిళ్లలోనూ కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

ప్రముఖ వంటనూనెల ఉత్పత్తి సంస్థ గోల్డ్‌డ్రాప్‌ను మరోసారి ప్రతిష్ఠాత్మక సీఐటీడీ అవార్డు వరించింది. ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్‌డ్రాప్ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ మితేష్ లోహియా అందుకున్నారు.

9 నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనమండలి, శాసనసభ సమావేశాలు ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ జారీ చేసిన గెజిట్ ఆధారంగా అసెంబ్లీ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు నోటిఫికేషన్ విడుదల చేశారు.

బుర్రా వీఆర్ఎస్‌కు ఆమోదం

నేడు టీజీపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తేతెలంగాణ): సీనియర్ ఐఏఎస్ బుర్రా వెంకటేశం స్వచ్ఛంద పదవీ విరమణకు ఆమోదం తెలుపుతూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. విద్యాశాఖ స్పెషల్ సీఎస్‌గా పనిచేస్తున్న ఆయన్ని టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే.

యూపీఐ లైట్ పరిమితి 5 వేలకు పెంపు

ముంబై, డిసెంబర్ 4: యూపీఐ లైట్‌కు సంబంధించి ఆర్థిక లావాదేవీలు జరిపేవారికి రిజర్వుబ్యాంక్ శుభవార్తను అందించింది. యూపీఐ లైట్ వ్యాలెట్ పరిమితిని రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. అలాగే ఒక్కో లావాదేవీ పరిమితిని రూ.500 నుంచి రూ.1,000కి సవరించింది. ఎలాంటి పిన్ నంబర్ లేకుండానే ఆఫ్‌లైన్‌లో మొబైల్ ద్వారా లావాదేవీలు జరిపేందుకుగాను ఆర్బీఐ గతంలోనే లైట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవల కోసం యూపీఐ లైట్ వ్యాలెట్‌ను నగదు ఉంచాల్సి ఉంటుంది.

హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ

హైదరాబాద్, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ): ఇంటర్నెట్ సర్చ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్..హైదరాబాద్‌లో సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్(జీఎస్ఈసీ)ని నెలకొల్పడానికి ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అధికారిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. దేశంలో తొలి సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ కాగా, అలాగే ప్రపంచంలోనే ఐదోది కావడం విశేషం. ఈ జీఎస్ఈసీ ఏర్పాటునకు సంబంధించి గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్..రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం హాన్సెన్ మాట్లాడుతూ..డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో రాష్ట్రం ముందంజలో ఉన్నదని, ప్రపంచవ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజినీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉన్నదన్నారు. ఈ నూతన సేఫ్టీ సెంటర్ ద్వారా సైబర్ సేఫ్టీ సమస్యలను వేగవంతంగా పరిష్కరించడానికి వీలు పడనున్నదన్నారు. అలాగే ఈ సెంటర్‌తో వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్

ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులకు కిక్కు

జీఎస్ఈసీ ప్రత్యేకమైన అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ హబ్. ఇది అధునాతన భద్రత, ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించనున్నది. ఏఐ ఆధారిత భద్రత, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, పరిశోధకులకు ఈ సేఫ్టీ సెంటర్ సహకారం అందించనున్నది. ఇదిలావుంటే దేశంలో నైపుణ్యాభివృద్ధిని, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలు పెంపొందించే లక్ష్యంగా ఈ సెంటర్ పని చేయనున్నది.

కొనసాగుతున్న రుపీ పతనం

ముంబై, డిసెంబర్ 4: దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు పడ్డాయి. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో రూపాయి చారిత్రక కనిష్ఠ స్థాయికా జారుకున్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 7 పైసలు కోల్పోయి 84.75 వద్దకు పడిపోయింది. గ్లోబల్ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం వల్లనే కరెన్సీలు పతనం చెందాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 84.66 వద్ద ప్రారంభమైన రుపీ-డాలర్ రేటు 64.65-84.76 స్థాయిలో కదలాడింది.

సీఎస్ఆర్ నిధులతో గ్రామాల్లో సదుపాయాలు

- ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్
- ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఆరు బోర్‌వెల్స్ పనులు ప్రారంభం

కాసిపేట : గ్రామస్తులతో కలిసి బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న ఓరియంట్ అధికారులు

కాసిపేట, డిసెంబర్ 4 : సీఎస్ఆర్ నిధులతో ఓరియంట్ కంపెనీ పరిధిలోని గ్రామాల్లో సదుపాయాలు కల్పిస్తున్నట్లు దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్ పేర్కొన్నారు. బుధవారం కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆరు బోర్‌వెల్స్ పనులను ప్రారంభించారు. వేసవిలో నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని ఓరియంట్ కంపెనీ పరిధిలోని ఆదివాసీ గిరిజన గ్రామాలైన గట్రావ్‌పల్లి పంచాయతీలోని తుడుంగూడ, గట్రావ్‌పల్లి, ఇప్పలగూడెం, సాలేగూడలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో బోర్‌వెల్స్ మంజూరు కాగా ఓరియంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్ చేతుల మీదుగా గ్రామ పెద్దలతో కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనిట్ హెడ్ బాల గిరిధర్ మాట్లాడుతూ ఈ ఆరు బోర్ వెల్స్‌ను సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ హెచ్ఆర్ జీఎం ఆనంద్ కులకర్ణి, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ పెంద్రం రాజు, యూనియన్ నాయకులు భారతాని సతీశ్, సివిల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, గ్రామ పెద్దలు సిడాం గణపతి పాల్గొన్నారు.

మంత్రి పదవి కోసం ఎమ్మెల్యే ఢిల్లీకి చక్కర్లు

బెల్లంపల్లి, డిసెంబర్ 4 : నియోజకవర్గ అభివృద్ధిని పక్కనపెట్టి మంత్రి పదవి కోసం ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారని మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ ఆరోపించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై చార్జిషీట్ విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే స్థానికంగా ఉండకుండా హైదరాబాద్‌లో ఏసీ ఇంటికి పరిమితం కావడంతో బెల్లంపల్లిలో కాంగ్రెస్ నాయకులు భూకబ్జాలకు పాల్పడుతూ ప్రభుత్వ ఆస్తులు, భూములను దోచుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ గత ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకుని అధికారంలోనికి వచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, నాయకులు తిరుపతి, గోవర్ధన్, కేశవ్‌రెడ్డి, రాజులాల్, రామయ్య, శైలెందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్

కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలు

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 4: ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ, ఆశ కార్యకర్తలకు స్థిర వేతనం 18వేలు చెల్లించాలన్నారు. లెప్రసీ, పల్స్‌పోలియో, టీబీ బకాయి పారితోషికాలు చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆశ వర్కర్లను కార్మికులకు గుర్తించి కార్మిక చట్టం పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. జిల్లా వైద్యాధికారి సీతారాం నాయక్ మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న లెప్రసీ బిల్లుల మొత్తంలో 50 శాతం చెల్లిస్తామని, మిగతా విషయాలను ఉన్నతాధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి, పద్మ, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు భాగ్య, కేసర, పంచశీల, తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్, డిసెంబరు 4 : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సమ్మక్క, శోభలు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను చెల్లించాలని, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఆశాలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అడవులు, వన్యప్రాణులను సంరక్షించాలి

రెబ్బెన లో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

కెరమెరి, డిసెంబర్ 4: అడవులతోపాటు వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కెరమెరి ఎఫ్ఆర్వో సయ్యద్ మజారొద్దీన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇక్కడ అటవీ శాఖ సిబ్బంది, పాఠశాల విద్యార్థులున్నారు.

రెబ్బెన, డిసెంబర్ 4: అటవీ జంతువుల సంరక్షణ అందరి బాధ్యత అని రెబ్బెన రేంజ్ అధికారి నిజాముద్దీన్ అన్నారు. రెబ్బెన మండల కేంద్రంలో అటవీ జంతువుల సంరక్షణ దినోత్సవం పురస్కరించుకొని రెబ్బెన రేంజ్ అటవీశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెబ్బెన డిప్యూటీ రేంజ్ అఫీసర్ బానేశ్, ఫారెస్ట్ సెక్షన్ అఫీసర్ బాబు, బీట్ అఫీసర్లు దేవేందర్, సద్దాం, వెంకటేశ్, తిరుపతి, సురేందర్, స్వాతి, శ్రీలత, ఉషారాణి, అస్మా తదితరులున్నారు.

తిర్యాణి, డిసెంబర్ 4 : వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని గిన్నెధరి రేంజ్ ఇన్‌చార్జి అటవీ శాఖ అధికారి సరోజ రాణి పేర్కొన్నారు. బుధవారం తిర్యాణి మండలంలో ప్రపంచ వన్యప్రాణి పరిరక్షణ దినోత్సవాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ఇక్బాల్ మైమోద్దీన్, సెక్షన్ అధికారులు ఆత్రం రవీందర్, భీమ్లా నాయక్, ఉజ్వల్ ప్రసాద్, శ్రీనివాస్, భీంరావు, అటవీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి

- సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా
- హాస్టల్లో సబ్ కలెక్టర్ తనిఖీలు

కేజీబీవీలో కూరగాయలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

బెజ్జూర్, డిసెంబర్ 4 : విద్యార్థులకు పోషకాహారం అందించాలని సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సూచించారు. మండల కేంద్రంలోని హాస్టళ్లను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మండల కేంద్రంలోని కేజీబీవీకి వెళ్లిన సబ్‌కలెక్టర్ విద్యార్థుల భోజనంపై ఎస్వో అరుణను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రూంలోని కూరగాయలను పరిశీలించారు. నాణ్యతలేని కూరగాయలు సరఫరా చేస్తే తహసీల్దార్‌కు ఫిర్యాదులు చేయాలని సూచించారు. కూరగాయలతోపాటు పాడైన గుడ్లు ఉన్నాయని, ఇలాంటి సరుకులతో కూడిన భోజనంతో విద్యార్థులు ఎలా ఆరోగ్యంగా ఉండారన్నారు. ఆశ్రమ పాఠశాలలో వండిన పప్పును పరిశీలించారు. సరుకులు, కూరగాయలతోపాటు బియ్యం, పప్పులు, నూనె కూడా నాణ్యంగా ఉండాలని వార్డన్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్, ఆర్ఎ సంతోష్, ఆయా కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

మంత్రి పదవి కోసమే రెచ్చగొడుతున్నారు

మందమర్రిలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య

మందమర్రి, డిసెంబర్ 4: మంత్రి పదవి కోసమే చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మాల కులస్తులను రెచ్చగొడుతున్నాడని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరు సమ్మయ్య ఆరోపించారు. మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెద్దపల్లి పార్లమెంట్, చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాలలు ఎవరు పోటీ చేసినా మాదిగ కులస్తులు ఓటు వేసి గెలిపించారనే విషయాన్ని గుర్తించాలన్నారు. చెన్నూర్‌లో ఎమ్మెల్యే వివేక్, బెల్లంపల్లిలో ఎమ్మెల్యే వినోద్‌లు మాల కులస్తులు ఎదగకుండా అడ్డుపడుతున్నారని దీనిని వారు గుర్తించాలన్నారు. దేశ వ్యాప్తంగా వివేక్ కుటుంబం రాజకీయాల్లో తిరుగుతూ ఆస్తులు పెంచుకుంటున్నారే తప్ప వారు దళితుల కోసం చేసింది ఏమి లేదన్నారు. రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే, ఎంపీ, రాజ్యసభ అవకాశాలు కల్పించినా తిరస్కరించిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను విమర్శించే స్థాయి వివేక్‌కు లేదన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ ఏ ఒక్క దళితునికి సహాయ చేసిన దాఖలాలు లేవని దళితుల మద్య చిచ్చు పెట్టకుండా ఇప్పటిరైనా వర్గీకరణకు మద్దతు తెలిపాలన్నారు. లేకపోతే చెన్నూర్ నుంచి తరిమి కొడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఆసంపల్లి శివ, మిట్టపల్లి బాబు, జిలకర శంకర్, ఆసంపల్లి అభిల్, ఆయిందాల సది, సంది రవి, నందిపాట రవి పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- రెబ్బెన మండలంలో కలెక్టర్ పర్యటన

రెబ్బెన పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

రెబ్బెన, డిసెంబర్ 4: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. రెబ్బెన మండలంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనంతో తరగతి గదులు, వంటశాల, రిజిష్టర్లు, నిత్యావసర సరుకులు, పరిసరాలు క్షుణంగా పరిశీలించారు. అనంతరం, ఎంపీడీ